
# నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, పరిహారం ప్రక్రియలు వేగవంతం చేయాలి





● **పెండింగ్ భూసేకరణ, పునరావాస పనులను త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**మిడ్జిల్, ఆగస్టు 21 (నేటి దర్శిని, మహబూబ్‌నగర్ జిల్లా బ్యూరో):**
జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, పునరావాస ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తంకుమార్‌రెడ్డి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు.

**రైతులతో మాట్లాడి భూసేకరణ సమస్యలను పరిష్కరించాలి**

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. భూసేకరణలో ఏవైనా సమస్యలు ఉంటే రైతులతో నేరుగా మాట్లాడి పరిష్కరించాలని, నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారం, పునరావాస ప్రక్రియలను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు.

**ప్రాజెక్టుల పనులకు ఆటంకం లేకుండా చర్యలు**

అంతకుముందు వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఎన్. ఉత్తంకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, నీటిపారుదల ప్రాజెక్టుల పనులను సకాలంలో పూర్తి చేసేందుకు పెండింగ్ భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయడం అత్యంత కీలకమన్నారు. కొత్త ఆయకట్టు సృష్టించేందుకు అవసరమైన భూసేకరణ, పునరావాస పనులను వేగవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని, భూసేకరణ కారణంగా ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు.

**సమావేశంలో అధికారులు పాల్గొన్నారు**

ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్‌రెడ్డి, ఇంజనీరింగ్, రెవెన్యూ శాఖలకు చెందిన సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 'బడి మొగ్గలు' పుస్తకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా




**మిడ్జిల్, ఆగస్టు 21, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
పాలమూరు జిల్లాకు చెందిన ప్రముఖ కవి డా. భీంపల్లి శ్రీకాంత్ రచించిన 'బడి మొగ్గలు' పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థి జీవితానికి దిశానిర్దేశం చేసే పాఠశాలల గురించి, ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాల గురించి రచయిత పుస్తకాన్ని రూపొందించడం అభినందనీయమన్నార. ఇది ఉపాధ్యాయ వృత్తి పట్ల రచయితకు ఉన్న గౌరవభావాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసే దిశగా ఇలాంటి రచనలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి డా. ఐ. విజయకుమారి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించే విధంగా 'బడి మొగ్గలు' పుస్తకం రూపుదిద్దుకుందని తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరూ పాఠశాలలను, విద్యార్థులను ప్రోత్సహిస్తే వారిలో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎం.ఓ దుంకుడు శ్రీనివాస్, జి.సి.డి.ఓ అస్రాఖాద్రి, తదితరులు పాల్గొన్నారు.

# మిడ్జిల్ విద్యారంగానికి నూతన సారథి



**మిడ్జిల్, ఆగస్టు 21, (నేటి దర్శిని):**
మిడ్జిల్ మండల విద్యాశాఖాధికారిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోమాల్ ప్రధానోపాధ్యాయులు వెంకట రాములు బాధ్యతలు స్వీకరించారు. మండల విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఆయన పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, మెరుగైన విద్యాబోధన, మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల నమోదు శాతం పెంపునకు కృషి చేయాలని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా వెంకట రాములు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఉపాధ్యాయుల సహకారంతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తన ధ్యేయమని పేర్కొన్నారు.





# సత్య సాయి మందిర్‌లో ఘనంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు

**ఆమనగల్లు,ఆగస్టు21 (నేటి దర్శిని);**
రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం సాయి మందిర్ లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా సాయి మందిర్ లో మహిళా భక్తులు 50 కి పైగా సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. శ్రావణమాసం రెండవ శుక్రవారం అందరూ కలిసి వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. సాయి మందిర్ నిర్వాహకులు మాట్లాడుతూ హిందూ సాంప్రదాయంలో శ్రావణమాసానికి విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని, ముఖ్యంగా శ్రావణ శుక్రవారం రోజున శ్రీ వరలక్ష్మీ దేవిని భక్తిశ్రద్ధలతో పూజించడం ద్వారా కుటుంబంలో కలిగే సుఖశాంతులు,ఐశ్వర్యం, ఆరోగ్యం,సౌభాగ్యం, కలుగుతాయని భక్తుల విశ్వాసమని,సుమంగళిలు స్త్రీలు కుటుంబ శ్రేయస్సు భర్త ఆయురారోగ్యాలు,సంతాన సౌభాగ్యం, ఇంటిల్లిపాది సుఖసంతోషాల కోసం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తారన్నారు. సాయి మందిర్ నిర్వాహకులు సత్యసాయి మందిరాన్ని పచ్చటి తోరణాలతో, రకరకాల పుష్పాలతో,కాషాయ జెండాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.వేద పండితుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, రకరకాల నైవేద్యాలను సమర్పించారు.సత్య సాయి బాబా బోధించిన "ప్రేమించు.. సేవ చేయు"అనే సేవా భావనకు అనుగుణంగా సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.భక్తిలో సేవాభావం,సేవలో మానవత్వం ఉండాలని సత్యసాయి బాబా సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమితి నిరంతరం కృషి చేస్తుందన్నారు.పూజా కార్యక్రమాల అనంతరం నారాయణ సేవ కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు, పట్టణ ప్రజలకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు.సాయి మందిర్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.ఈ కార్యక్రమంలో దొంతు శ్రీనివాస్,డాక్టర్ దొంతు పుల్లయ్య,చేనేత సహకార సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీను,గోల్డ్ రాము,గోల్డ్ బ్రహ్మం,నాగిళ్ల లింగం, ఎన్ఆర్ ప్రభాకర్,దాస శ్రీను, రామాచారి,అప్పం తిరుపతయ్య, ఆర్టిఏ శేఖర్,అల్లాజి,పోలిశెట్టి శ్రీనివాస్,ఆనంద్,గందె శేఖర్,చంటి, నారాయణ సాగర్,కృష్ణారెడ్డి,గంజి వెంకటేష్,మహిళా భక్తులు,దొంతు విజయలక్ష్మి ,సంధ్య, అప్పం అలివేలు, బొంతు కృష్ణవేణి శైలజ, అశ్విని,అవ్వారి భాగ్య,గుర్రం విజయ,సునీత,భావండ్ల సునీత, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆత్మా ద్వారా జొన్న, వరి పంటల్లో సస్య రక్షణపై క్షేత్ర స్థాయి ప్రదర్శనలు



**ఆమనగల్లు, ఆగస్టు21 (నేటి దర్శిని):**
ఆత్మ పథకం ఆధ్వర్యంలో ఆమనగల్లు మండలం రాంనుంతల, పోలేపల్లి, శెట్టిపల్లి గ్రామాల్లో జొన్న, వరి పంటల్లో సస్య రక్షణ, పోషక యాజమాన్య పద్ధతులపై రైతుల పొలాల్లో క్షేత్ర ప్రదర్శనలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తెగుళ్ల నివారణ,సమగ్ర పోషక యాజమాన్యంపై అవగాహన కల్పించారు. పంటలలో చీడపీడలు, తెగుళ్లను గుర్తించి సకాలంలో నివారణ చర్యలు చేపట్టడం ద్వారా పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చని అధికారులు రైతులకు సూచించారు. ఈ సందర్భంగా రైతులకు ట్రైకోడెర్మా విరిడి, సూడోమోనాస్,సూక్ష్మ పోషకాలు, మందు గుళికలను అందజేశారు. వీటిని పంటలకు అవసరమైన విధంగా వినియోగించడంతో మొక్కల ఆరోగ్యం మెరుగుపడి, దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు సంప్రదాయ పద్ధతులతో పాటు శాస్త్రీయ సాగు విధానాలను పాటించాలని సూచించారు.పంటలకు సమతుల్యంగా పోషకాలను అందించడం, నేల స్వభావానికి అనుగుణంగా ఎరువుల వినియోగం,సస్య రక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. రైతుల పొలాల్లో నిర్వహించే క్షేత్ర ప్రదర్శనలు ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ నాణ్యమైన దిగుబడులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ వో లు మీనాక్షి, ప్రభావతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్.. 2కిలోలు స్వాధీనం




**నిడమానూరు, ఆగస్టు 21 (నేటి దర్శిని):**
నిడమానూరు మండల పరిధిలోని ఇండ్లకోటయ్యగూడెం గ్రామ సమీపంలోని కోటమైసమ్మ గుడి వద్ద గంజాయి విక్రయించేందుకు వచ్చిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి 2 కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.50 వేలుగా పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండలంలోని జటావత్ తండా, రమావత్ తండాకు చెందిన జటావత్ వినోద్ (డ్రైవర్) గతంలో పలు బైక్‌లు, సెల్‌ఫోన్ల చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. తుర్కయంజాల్, హైదరాబాద్‌కు చెందిన రమావత్ మహేష్ వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి, ఆగస్టు 20న కోటమైసమ్మ గుడి సమీపంలో విక్రయించేందుకు వచ్చినట్లు విచారణలో వెల్లడైంది. ఈ క్రమంలో పోలీసులు నిందితుడు జటావత్ వినోద్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు రమావత్ మహేష్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నల్గొండ జిల్లా ఎస్పీ శ్రీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు 'మిషన్ పరివర్తన'లో భాగంగా ఈ చర్యలు చేపట్టారు. హాలియా సీఐ ఎస్. రాఘవరావు పర్యవేక్షణలో నిడమానూరు ఎస్సై డి. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, క్లూస్ టీం సభ్యులు సంయుక్తంగా దాడి చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన నిందితుడికి శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడు రమావత్ మహేష్ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

## శెట్టిపల్లిలో పులి సంచారం అంటూ కలకలం.. హైనాగా గుర్తింపు

● ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గురుప్రసాద్





**ఆమనగల్లు, ఆగస్టు21(నేటి దర్శిని);** ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో పులి సంచరిస్తోందంటూ ప్రచారం జరగడంతో గ్రామస్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. గ్రామ పరిసరాల్లో పులి కనిపించిందంటూ వార్త వ్యాపించడంతో ప్రజలు అప్రమత్తమయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.దీంతో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గురుప్రసాద్ వెంటనే స్పందించి సిబ్బందితో కలిసి శెట్టిపల్లి గ్రామానికి చేరుకున్నారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో పరిశీలన చేపట్టి,స్థానికులు తెలిపిన వివరాలను సేకరించారు.అనంతరం అక్కడ కనిపించిన జంతువు పులి కాదని, హైనా సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు.దీంతో గ్రామస్తుల్లో నెలకొన్న ఆందోళన కొంతమేర తగ్గింది.పులి సంచారం లేదని,హైనా కదలికలు మాత్రమే ఉన్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గురుప్రసాద్ మాట్లాడుతూ గ్రామస్తులు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని సూచించారు. రాత్రి వేళల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా గ్రామ శివారు ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. వన్యప్రాణుల కదలికలు కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామస్తుల భద్రత దృష్ట్యా అటవీశాఖ సిబ్బంది పరిస్థితిని పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటారని గ్రామస్తులకు తెలిపారు.



## రూపారెడ్డి హత్యను ఖండిస్తూ ట్రస్మా ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ

**ఆమనగల్లు,ఆగస్టు21(నేటి దర్శిని):** నల్లగొండ జిల్లాలో పాఠశాల కరస్పాండెంట్ రూపారెడ్డి దారుణ హత్యను ఖండిస్తూ ట్రస్మా ఆమనగల్లు డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నీ నిర్వహించారు.అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. ట్రస్మా ఆమనగల్లు డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అబ్బిమల్ల శ్రీరామ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడుగుల, వెల్దండ మండలాలకు చెందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయ బృందాలు వందల సంఖ్యలో పాల్గొని రూపారెడ్డి హత్యకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.పట్టణంలోని జాతీయ రహదారిపై భారీగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం తహసీల్దార్



కార్యాలయానికి చేరుకుని అధికారికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ట్రస్మా నాయకులు మాట్లాడుతూ.. విద్యారంగంలో పనిచేస్తున్న పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులపై బెదిరింపులు, భౌతిక దాడులు,వేధింపులు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలలపై దాడులు పునరావృతం కాకుండా ప్రత్యేక రక్షణ చట్టాన్ని వెంటనే ప్రవేశపెట్టాలని కోరారు.విద్యారంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరి ప్రాణ,ఆస్తి భద్రతకు ప్రభుత్వం తగిన భరోసా కల్పించాలని అన్నారు. పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక జిల్లా పోలీస్ నోడల్ అధికారి వ్యవస్థను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ర్యాలీకి ముందు రూపారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా ట్రస్మా ప్రతినిధులు చుక్క అల్లాజీ గౌడ్,5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము,అవ్వారి శివలింగం,అవ్వారి నిరంజన్, గోలి శ్రీనివాసులు, కోట్ల వెంకటేష్, ఆమనగంటి సంజీవ్ కుమార్,కమటం శేఖర్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణస్వామి, ఆంజనేయులు, జంగయ్యగౌడ్, రామస్వామిగౌడ్, తిరుమలేష్, శ్రీశైలం, రమేష్, విట్టల్,బోడ నరేష్,గజె యాదయ్య, మహిళా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డుకు మరమ్మతులు చేయాలి

● మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ కోరిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి



**మిడ్జిల్, ఆగస్టు 21, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మరికల్ మండలంలోని బుద్యాగాని తండా--ఎలిగండ్ల జాతీయ రహదారి మధ్యలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి కింద బీటీ రోడ్డు గత రెండు, మూడు సంవత్సరాలుగా దెబ్బతినడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ సమస్యను పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదని ఆయన పేర్కొన్నారు. నెల రోజుల క్రితం ఈ విషయాన్ని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మ దృష్టికి తీసుకెళ్లగా, ఆమె వెంటనే స్పందించి రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడారని తెలిపారు.తాజాగా జరిగిన సౌత్ సెంట్రల్ రైల్వే అధికారుల సమావేశంలో ఎంపీ డీకే అరుణమ్మ ని మరోసారి కలిసి, అండర్ బ్రిడ్జి కింద దెబ్బతిన్న బీటీ రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి కోరారు. దీనిపై స్పందించిన రైల్వే అధికారులు త్వరలోనే రోడ్డును పరిశీలించి, దెబ్బతిన్న ప్రాంతాల్లో అవసరమైన మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిన ఈ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణమ్మకి బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## సాగునీటి విషయంలో రైతులకు ద్రోహం!






● నాగార్జునసాగర్‌కు నీరు రాకుండా పోతిరెడ్డిపాడుకు తరలింపా?

● ఏఎంఆర్‌పీ నీటితో చెరువులు, కుంటలు నింపాలి: రమావత్ రవీంద్రకుమార్

**దేవరకొండ, ఆగస్టు 21 (నేటి దర్శిని) :** సాగునీటి విషయంలో తెలంగాణ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆరోపించారు. పీఏపల్లి మండలం గణపురం స్టేజీ సమీపంలోని ఏఎంఆర్‌పీ ప్రధాన కాలువ డిస్ట్రిబ్యూటర్ గేట్ల వద్ద శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు.కృష్ణా నదికి ఎగువ నుంచి సమృద్ధిగా నీరు వస్తున్నా నాగార్జునసాగర్‌కు నీరు రాకుండా పోతిరెడ్డిపాడు ద్వారా భారీగా తరలిస్తున్నారని విమర్శించారు. సుమారు 25 వేల క్యూసెక్కుల నీటిని పోతిరెడ్డిపాడు నుంచి తరలిస్తున్నారని, నాగార్జునసాగర్ నిండే వరకు అక్కడి నుంచి నీటిని తీసుకెళ్లకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీటిని ఎవరి ఆదేశాలతో తరలిస్తున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు.

**రైతులకు రెండు పంటలకు నీరివ్వాలి**

కేసీఆర్ హయాంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద రైతులకు సమృద్ధిగా సాగునీరు అందించామని రవీంద్రకుమార్ గుర్తుచేశారు. ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే రెండు పంటలకు నీరు అందించవచ్చన్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**ముందుగా స్థానిక చెరువులు నింపాలి**

ఏఎంఆర్‌పీ నీటిని ముందుగా గుడిపల్లి, పీఏపల్లి మండలాల్లోని చెరువులు, కుంటలకు విడుదల చేసి నింపాలని కోరారు. చెరువులు ఎండిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, రైతులు, ప్రజలు, పశువులకు నీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండకు నీటిని తరలించడంతో పాటు స్థానిక అవసరాలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

స్థానిక ఎమ్మెల్యేకు నల్లమట్టిపై ఉన్న ప్రేమ రైతులపై లేదని రవీంద్రకుమార్ విమర్శించారు. నల్లగొండకు నీటిని తరలిస్తున్నా స్థానిక రైతుల సాగునీటి సమస్యలపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. “చెరువులు, కుంటలు నింపాలి.. స్థానిక రైతాంగాన్ని, ప్రజలను కాపాడాలి” అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యానాయక్, మండల అధ్యక్షులు వెల్లుగూరి వల్లపు రెడ్డి, సీనియర్ నాయకులు కటికనేని మాధవరావు, తోటకూరి పరమేష్, మద సుధాకర్‌గౌడ్, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు కంకణాల వెంకట్‌రెడ్డి ఆశీస్సులు



**చింతపల్లి ఆగస్టు 21 నేటి దర్శిని :** చింతపల్లి మండలం తీదేడు గ్రామానికి చెందిన తిరుమణి విష్ణు--వసంత దంపతుల కుమార్తె సుష్మ, శివకుమార్‌ల వివాహ వేడుకకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. భవిష్యత్ జీవితం ప్రేమానురాగాలు, ఆనందంతో నిండాలని శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో తీదేడు సర్పంచి ఉలుపాల స్వప్న శేఖర్‌రెడ్డి, ధేన్యతండ సర్పంచి రమావత్ కొండల్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు మద్రు రామారావు, సిమర్ల శ్రీను యాదవ్, కాయితి బచ్చిరెడ్డి, రమావత్ మాంత్యనాయక్, సిమర్ల పర్వతాలు యాదవ్, సిమర్ల రాములు, సందె నీరంజన్, వీరమల్ల వెంకటయ్య, దాసరి మల్లయ్య, ఉడుత శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన బ్రీజా కారు సొంతం చేసుకున్న ఎస్ఎస్ ఇంజనీరింగ్ అధినేత

● నల్గొండ పవన్ మోటార్స్ లో నూతనంగా ఆవిష్కరించిన బ్రిజా కార్ కొత్త మోడల్ మొదటి కారును సొంతం చేసుకున్న కొండా వెంకటేష్

**నల్గొండ, ఆగస్టు 21 (నేటి దర్శిని):** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నిదానపల్లి గ్రామానికి చెందిన ఎస్ఎస్ ఇంజనీరింగ్ అధినేత కొండ వెంకటేష్ నూతన బ్రీజా కారును శుక్రవారం కొనుగోలు చేశారు. నల్గొండలోని పవన్ మోటార్స్‌లో కొత్త మోడల్ బ్రీజా వాహనాన్ని ఆయన సొంతం చేసుకున్నారు.ఈ సందర్భంగా పవన్ మోటార్స్ జనరల్ మేనేజర్ చెరుకూరి నాగమణి చేతుల మీదుగా కొండ వెంకటేష్‌కు నూతన వాహనాన్ని అందజేశారు. కారు డెలివరీ సందర్భంగా కుటుంబ సభ్యులు, సన్నిహితులు వెంకటేష్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక



దినపత్రిక చీఫ్ ఎడిటర్, సీఈఓ కొండ మల్లేశం గౌడ్, గాదగాని మాణిక్యం గౌడ్, పబ్బతి సుందరయ్య, కొండ శశికాంత్, పవన్ మోటార్స్ సేల్స్ మేనేజర్ గంజి రవికుమార్, అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ కె. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

